క్లుప్తంగా

అవగాహన సదస్సు రేపు

పార్వతీపురం టౌన్: వినియోగదారుల హక్కులు, బీఎస్ఎన్ఎల్ సేవలపై శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఆడమ్ గొల్లమూడి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పాల్గొనే వారు htt pr://-ÆŠæn$-bèle-t.-g-o-of e.c-o-m/z-v-e& yxxm& ye u గూగుల్ మీట్ లింక్‌లో చేరాలని సూచించారు.

అవగాహన తప్పనిసరి



పెట్రోల్ బంకు వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి పి. పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం, వేడి ఈ మూడింటిలో ఒక దానిని అదుపుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చునన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, తదితర ప్రమాదాలను ఏ విధంగా నివారించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతో మెలగాలి

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో మెలగాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. కొత్తవలస ప్రాంత పరిధిలో గల నవ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో దక్షిణ గాలిగోపురం ప్రారంభంతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జిల్లా జనరల్ సెక్రటరీ వెంపలి గురురాజు, సీనియర్ నాయకులు ఎజ్జవరపు పోలి నాయుడు, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేయించుకోవాలి

పార్వతీపురం టౌన్: రక్తపోటు ఉన్న వారు విధిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని ఆప్తాలమిస్ట్ నగేష్‌రెడ్డి అన్నారు. అడ్డాపుశీల సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేపట్టి మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పాచిపెంట: మండలంలోని కర్రివలస రెవెన్యూ బొబ్బిలివలస గ్రామంలో జగనన్న శాశ్వత భూసంరక్షణ స్వామిత్వ సర్వేలో భాగంగా 95 మంది రైతులకు పట్టాలను అందించారు. బొబ్బిలివలస గ్రామంలో సర్పంచ్ పెద్దింటి గంగమ్మ అధ్యక్షతన పట్టాలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

పాచిపెంట: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని భూగర్భ నీటి శాఖ డీడీ, ప్రత్యేకాధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటు ఆవశ్యకత, ఓటు హక్కును అందరు వినియోగించుకోవాలని, పోలింగ్ శాతం పెంచడం తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీఓ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యం కలిగిస్తే చర్యలు

పార్వతీపురం: విద్యార్థులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవని జిల్లా సాల్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్.నాగరాజు సిబ్బందికి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, విద్యుత్, సైన్స్ ల్యాబ్‌లతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ బి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం వై.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలుప్పిలో అభివృద్ధి జోరు..

- అభివృద్ధి పనులతో గ్రామ రూపురేఖలు మార్చేసిన జగనన్న సర్కార్
- సంక్షేమ ఫలాలతో ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

సీతానగరం:



అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే గెడ్డలుప్పి గ్రామంలో నేడు అభివృద్ధి పరుగులెడుతోంది. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముందుచూపుతో గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోంది. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులందరికీ అందుతుండడంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతుండడంతో గ్రామస్తుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జగనన్న ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించాక గ్రామానికి కోట్లాది రూపాయలు మంజూరయ్యాయని గెడ్డలుప్పి ప్రజలు ఆనందంగా చెబుతున్నారు. రహదారి సౌకర్యాలు కల్పించడం.. పాఠశాలలను అభివృద్ధి చేయడం.. పంట దిగుబడులు కొనుగోలు చేయడం..తదితర సౌకర్యాలు కల్పించడంతో గెడ్డలుప్పిలో అభివృద్ధి కనిపిస్తోంది. ప్రజాసంకల్పయాత్ర సమయంలో గ్రామానికి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి సువర్ణముఖి నదిపై వంతెన నిర్మించాల్సిన అవసరాన్ని తెలియజేయగా.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వంతెన ఏర్పాటు చేశారు. దీంతో వంతెన ఏర్పాటు చేయాలన్న దశాబ్దాల కల నెరవేరింది. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేమని గ్రామస్తులు చెబుతున్నారు.



గెడ్డలుప్పి సచివాలయం

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు	ఖర్చు
సచివాలయ భవనం	రూ.43 లక్షలు
వెల్‌నెస్ భవనం	రూ.17.5 లక్షలు
రైతుభరోసా భవనం	రూ. 2,56,44,650
జగనన్న హౌసింగ్ నిర్మాణాలు	రూ.1,20,91,604
వైఎస్సార్ ఆసరా	రూ.65,70,400
వైఎస్సార్ చేయూత	రూ.1,20,57,500
జగనన్న అమ్మఒడి	రూ.1,11,25,210
వైఎస్సార్ పెన్షన్‌కానుక	రూ.5,06,15,500
నాడు నేడు పనులు	రూ.40 లక్షలు
సీసీరోడ్లు, కాలువలు	రూ.36 లక్షలు
ఇంటింటి కుళాయిలు, ఇతర అభివృద్ధి పనులు	రూ.87 లక్షలు
సువర్ణముఖీనదిపై వంతెన	రూ. 12.5 కోట్లు



సువర్ణముఖీ నదిపై నిర్మించిన వంతెన

అర్హులకు సంక్షేమ పథకాలు..



పిల్లలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న సమయంలో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి అమ్మఒడి పథకాన్ని తీసుకువచ్చారు. దీంతో మా పిల్లలను సక్రమంగా చదివంచుకుంటున్నాను. అలాగే రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాలతో ఆర్థిక లబ్ధి చేకూరింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం. – బలిజిరెడ్డి మణి, పొదుపు సభ్యురాలు, గెడ్డలుప్పి

సమస్యలు తీరాయి..



గెడ్డలుప్పి, పక్కనున్న గ్రామాలను దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న సమస్యలు జగనన్న రాకతోనే పరిష్కారమయ్యాయి. ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్న చొరవ, ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేసిన కృషి ఫలితంగా గ్రామానికి కోట్లాది రూపాయల నిధులు విడుదల కావడంతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా వంతెన, సీసీ రోడ్లు, కాలువలు, ఆస్పత్రి సౌకర్యాలు కల్పించడం అభినందనీయం. – అల్లు విజయమ్మ, గెడ్డలుప్పి, సీతానగరం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం..



ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజల సమస్యలు తెలుసుకుని సీసీ రోడ్లు, కాలువలు నిర్మించచారు. రహదారి సౌకర్యం కల్పించి, పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. అర్హులైన వారందరికీ జగనన్న గృహాలు , తాగునీరు సౌకర్యం కల్పించారు. దీంతో అన్ని విధాలుగా తమను ఆదుకున్న వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటాం. – కలిగి జయమ్మ, పొదుపుసంఘం వీఓఏ, గెడ్డలుప్పి



గెడ్డలుప్పికి వంతెనకు మధ్యలో ఎప్రోచ్ రోడ్డు



పూర్తికావచ్చిన గ్రామీణ ఆస్పత్రి భవనం



మౌలిక వసతులతో ఉన్న అదనపు పాఠశాల భవనాలు

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన చినఅంకలాం సర్పంచ్

పార్వతీపురం టౌన్: చినఅంకలాం సర్పంచ్ పోల తిరుపతిరావు, అప్పలనరసమ్మ, తదితరులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే జోగారావు వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతిరావు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. తనతో పాటు గ్రామానికి చెందిన ముఖ్య నాయకులందరూ వైఎస్సార్‌సీపీలో చేరడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోల సత్యనారాయణ, వెంపలి గుర్రాజు, పోల బలరాం నాయుడు, డోకుల ముసలినాయుడు, బోను నూకలనాయుడు, పోల సత్యం, గౌరినాయుడు, బెహరా జోగులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు 'సిద్ధం'

సీతానగరం: సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మండలంలోని రంగంపేట వాసులు స్పష్టం చేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డి. పద్మావతి, పి. సరస్వతి, పి. వెంకటరమణ, కె. రామకృష్ణ, ఎ.శివున్నాయుడు, పి.రవి, ఎస్. వెంకటనాయుడు , తదితరుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ.. కుల,మత,రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరగా.. గ్రామస్తులందరూ చప్పట్లతో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు వై. అరుణకుమారి, పార్టీ నాయకులు ఈశ్వరనారాయణ, పార్థసారథి, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, పి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

జాబితాలు పరిశీలించాలి..

బూత్ లెవల్ కన్వీనర్లంతా ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు అధ్యక్షతన బూత్ కన్వీనర్లు, పార్టీ అభిమానులకు పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించి, పలు సూచనలు చేశారు. అనంతరం 35 పంచాయతీల బూత్ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ జెండాను మళ్లీ ఎగురవేద్దామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పట్టణంలోని 20, 21 వార్డుల ప్రజా ప్రతినిధులతో 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు సాగాలన్న అంశాన్ని వివరించారు. మళ్లీ పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసే విధంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రాబోయే ప్రతిరోజూ మనందరికీ చాలా కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్నను గెలిపించుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, సచివాలయం కన్వీనర్లు సామల లలిత, చందాన ఆనంద్, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: మండలంలోని కాశీపట్నం కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.నాగదుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, బడి బయట పిల్లలు, చదువు మధ్యలో వదిలేసిన చిన్నారులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, దారిద్య్ర రేఖకు దిగువున ఉన్న బాలికలు మాత్రమే అర్హులని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 12వ నుంచి వచ్చే నెల11లోగా ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: మండలంలోని నెలిపర్తి పంచాయతీ దుగ్గిసాగరం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. పట్టణంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో వీరికి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ యువజన నాయకులు వేణు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకుడు సలాది అప్పలనాయుడు, ఎంపీటీసీ సూరప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకు పొత్తు

సాలూరు: కేసుల నుంచి తప్పించుకోవడానికే టీడీపీ, జనసేనలు బీజేపీతో పొత్తు పెట్టుకున్నాయని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాశరావు ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీలు వారి స్వార్థ రాజకీయాల కోసం ఆంధ్రా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కుల, మత శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

మక్కువ: అడారుగెడ్డపై బ్రిడ్జి నిర్మాణ పనులకు జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బ్రిడ్జి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గిరిశిఖర గ్రామాలకు చెందిన ప్రజలు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి రూ.1.50లక్షలు మంజూరు చేసింది. దీంతో ఈ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన సదస్సులు

సాలూరు రూరల్ : ఏజెన్సీలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఐసీడీఎస్ అధికారులు గిరిజన గ్రామాల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సీడీపీఓ సత్యవతి ఆధ్వర్యంలో కొఠియా గ్రామాలలో ప్రజలతో కలసి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సత్యవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పట్టుచెన్నూరు గ్రామంలో జగిరిన అవగాహన సదస్సులో నోడల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్వతీపురం మన్యంలో ఓటింగ్ శాతం 80 శాతానికి పెరగాలని అన్నారు. మీ ఓటు మీ భవిష్యత్తుకు దిశ నిర్దేశం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, విజయలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: బాధిత కుటుంబాలు అధైర్యపడొద్దని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుదని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. నియోజకవర్గంలోని పాచిపెంట మండలానికి చెందిన షేక్ అలిసా, సంక్రోతు గణేష్ కుటుంబాలకు రూ.లక్ష, వంతల డొంబయ్య కుటుంబానికి రూ.2లక్షలు మొత్తం రూ.4 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టమొచ్చినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. పార్వతీపురం పట్టణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష –2 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎంతో శ్రద్ధ వహిస్తోందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చడమే కాకుండా ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలకు కూడా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఓ పక్క ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం.. మరోపక్క జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి

పార్టీని నమ్మితే ఇదా విలువ?

- శంబర టీడీపీ ఎంపీటీసీ ఆవేదన

మక్కువ: దశాబ్దాల కాలం నుంచి టీడీపీతోనే ఉన్నాం. పార్టీ తరపున రెండు సార్లు ఎంపీపీతో పాటు, సర్పంచ్, ఎంపీటీసీని గెలిపించుకున్నాం. మక్కువ మండలంలో టీడీపీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ, కొత్తవారికి లేనిపోని ఆశలు చూపించి పార్టీనే నమ్ముకున్న వారికి పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసమని శంబర ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి బుధవారం శంబరలో నిర్వహించారు. ఈ సమావేశానికి తనను ఆహ్వానించారని, మండలంలో రెండుసార్లు, ఎంపీపీ ప్రతినిధిగా, టీడీపీ మాజీ అధ్యక్షుడిగా పనిచేసిన పెంట తిరుపతిరావును కలుపుకుని వెళ్లాలని కోరామని పోలినాయుడు తెలిపారు. అయినప్పటికీ సంధ్యారాణి నిరాకరించి, కార్యక్రమం నిర్వహించడంతో, గ్రామంలో ఐక్యంగా ఉన్న టీడీపీ నాయకుల మధ్య విభేదాలు సృష్టించి, లేనిపోని ఆశలు చూపించి కార్యక్రమాలు జరపడం ఎంతవరకు సబబని ఎంపీటీసీ పోలినాయుడు ప్రశ్నించారు. గత స్థానిక ఎన్నికల్లో అందరికీ అండగా ఉన్న పెంట తిరుపతిరావుకు అన్యాయం జరగడంతో అప్పట్లో పార్టీ మారి బీజేపీకి వెళ్లినప్పటికీ, టీడీపీ నాయకులకు అండగా నిలబడ్డారన్నారు. స్థానిక ఎన్నికల్లో ఇప్పుడున్న నాయకత్వం ఎవరినీ పట్టించుకోలేదని, అలాంటి వారి వెనుక ఎలా తిరగగలమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంధ్యారాణి అందరితో ఐక్యంగా వెళ్లకపోతే పార్టీని నమ్ముకున్న తమకు అన్యాయం జరగడం ఖాయమని వాపోయారు.



సంధ్యారాణికి సహకరించేది లేదని తెగేసి చెబుతున్న శంబర ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు

నివాళులు ..

పార్వతీపురం టౌన్: చంద్ర మౌళీశ్వరి శాలివాహన (కుమ్మరి) సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని దేవరవీధి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్ల విగ్రహానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కవయిత్రి మొల్ల విశిష్టతను వివరించారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జిల్లా జనరల్ సెక్రెటరీ వెంపలి గురురాజు, శాలివాహన సంఘ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కవియత్రి మొల్ల జయంతి..

పార్వతీపురం: కవియిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, జిల్లా శాలివాహన సంఘ గౌరవ అధ్యక్షుడు కొత్తూరు శంకరరావు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్‌ఓ కేశవనాయుడు మాట్లాడుతూ, రచయిత్ర మొల్ల దేశం గర్వించదగ్గ మహిళ అని, భావితరాలకు స్ఫూర్తి ప్రధాతని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి కృష్ణ, శాలివాహన సంఘ జిల్లా కార్యదర్శి ఉరిటి యాదవ్, ప్రతినిధులు ఎస్.ఈశ్వరరావు, సీహెచ్.రమణ, దొరబాబు పాల్గొన్నారు.